

# డాక్టర్ చెప్పిన కథలు

## – డా.శైలజ చందు



## - ఐదవ కథ -

అందరూ నాగరాజుకు పాలుపోస్తారు. మాకు నాగరాజే పాలుపోస్తాడు. మా నాన్న దగ్గర చదువుకున్నాడట . నాకైతే గుర్తు లేదు. పాలు మాత్రం బాగా చిక్కగా ఉంటాయి, వాటి మీద నీటిబొట్టు నిలుస్తుందేమోనన్నంత చిక్కగా ఉంటాయి.

ఓ రోజు , మా ఇంటికి ఆనుకున్న జామ చెట్టు మీదుగా ఓ కోతి, ఫామిలీతో సహా, కిచెన్ లోకొచ్చేసింది. పెద్ద కోతి జాంబవంతుడి సైజులో ఉండి రెండు కాళ్ళతో నడుస్తూ లోపలికొచ్చేసింది. . మా వంటావిడ బెదిరిపోయి పెద్దగా కేకలేస్తూ బయటికొచ్చింది. అదీ, వాళ్ళ పిల్లలూ కలిసి వంటింట్లో గిన్నల్నీ, సరుకులన్నీ దపారబోస్తూ, నానా రభస చేస్తుంటే ఏం చెయ్యాలో తోచక వంటింటి తలుపు మూసేసి బయట గడిపెట్టాను.

అంతలో వచ్చాడు నాగరాజు. విషయం విన్న వెంటనే కిందకెళ్ళి ఓ కర్ర తెచ్చుకున్నాడు. కిచెన్ తలుపు తీసి, అల్లరి చేస్తున్న కోతి మూకని విజయవంతంగా బయటికి తరిమేశాడు. దాంతో మా పిల్లల మనసులో ఒక హీరోలాగా స్థానం సంపాదించుకున్నాడు.

ప్రతిరోజూ పొద్దున్నే పిల్లలు స్కూలుకెళ్ళే టైముకు వస్తాడు. నాగరాజు పిల్లలతో బాగా కబుర్లు చెప్తాడు కానీ, నేను వెళ్తే సైలెంట్ అయిపోతాడు.

“అమ్మా , నాగరాజు బలే నవ్విపిస్తన్నాడమ్మా , నువ్వూ దామ్మా కూర్చో. నాగరాజూ, ఇందాక చెప్పింది మళ్లీ ఉప్పుడు మా మమ్మీకి సెప్పు.”

“మా అమ్మ వస్తే నుంచుంటావే. కూర్చో,ఏమనదు. కూచ్చో కూచ్చో" అంటూ పిల్లలు గొడవచేసినా సరే లేచి నిల్చునే ఉంటాడు.

★★★★★★

ఆ రోజు ఆదివారం. పిల్లలిద్దరూ ముందే లేచి ముందు వరండాలో కూర్చుని ఆడుకుంటున్నారు. నేను లేటుగా లేచి ముందుగదిలో పేపర్ చదువుకుంటున్నాను.

కాఫీ తాగితే బాగుండు నాగరాజు ఇంకా రాలేదేంటో అనుకుంటుంటే అచ్చమ్మ వచ్చింది.

పేపర్ చదువుతుంటే గుమ్మం దగ్గర పాల అచ్చమ్మతో బాబు కబుర్లాడుతున్నాడు.

“ అమ్మా, నాగరాజాళ్ళ మమ్మీ వొచ్చింది.” అంటూ లోపలికి కేకపెట్టి

“ఇవాల నువ్వొచ్చావే. నాగరాజు ఏడీ?” అడుగుతున్నాడు మా బాబు .

"భార్యని అమ్మకు సూపిచ్చటాకి తీసుకొచ్చాడు. కిందే కూకున్నాడు."

"బార్య అంతే?"

"పెద్దయినాక పెళ్ళి సేసుకుంటే నీక్కూడా బార్య వస్తది."

"నేను పెల్లి చేసుకోనుగా. రోజూ నువ్వు రావే? నువ్వు ఎక్కడికెల్తావు?"

"నేను గడ్డికోసుకోటాకి పొలమెల్తానయ్యా."

"పొలంలో పాములుంటయ్యా?" అమ్మాయి కూడా కలిసింది.

"అయ్యో లేకేంటీ, మొన్నోరోజు మా పిన్నమ్మ గడ్డికోసుకోటాకెల్తే తట్టలో సేరింది. దానిమీదే గడ్డేసుకుని తలమీద పెట్టుకొస్తంటే, ఒకటే కదుల్తుందేటా అని గుమ్మరిచ్చి సూస్తే, ఇంతబారు తాసు జర్ర, జర్ర పాకుంటా మా గుమ్మం ముందునుండే పోయింది."

"చంపొచ్చుగా?"

"సంపితే పాపం సుట్టుకుంటది. నాగుదేవత. దణ్ణవెట్టుకుంటే సుబ్బరంగా ఎల్లిపోద్ది. నా సిన్నప్పుడు మా బావిలో ఓ పాముండేది. ఈదులాడతా అప్పుడప్పుడు తలపైకి పెట్టి సూసేది."

"దాన్ని చంపేశారా?" పిల్ల అడిగింది.

"మా అయ్య దాన్ని అది నాగుదేవత. మనవొంశదేవత. దాన్ని పూజిచ్చాల సంపొద్దనేవోడు. నాగులసవితి నాడు , బాయి సుట్టూతా పదచ్చినాలు సేసి దణ్ణవెట్టోవోడు. పెళ్ళైకాపురానికొచ్చినాంక మొదటిపాలి పుట్టింటికిబోయినా , బాయిదగ్గర కాళ్ళు కడుక్కుని సేదతో నీళ్ళుతోడతంటే నాగుపాము ఓ పాలి తలెత్తి సూసింది. ఎందుకో కళ్ళు తిరిగినట్టయింది. మైకం కమ్ముకపోయి బాయిగట్టుమీద పడతంతే నా పెనిమిటి పట్టుకున్నాడు. అప్పుడే పిల్లగాడు కడుపున పడ్డాడు. అందుకేగా నాగరాజని పేరు పెట్టుకున్నా.

"పెనిమితి అంతే?"

"పెనిమిటి , మా ఆయన. మా నాగరాజు ఆళ్ళ దాడీ."

"దాడీ కాదు డాడీ. మరెప్పుడూ రాడే"

ఈ పిల్లలు ఏమ్మాట్లాడతారో వాళ్ళకే తెలియదు.

నాగరాజు వాళ్ళ నాన్న వీళ్ళతో ఉండడట. వేరే పెళ్ళి చేసుని రెండో భార్యతో ఉంటాడని ఎప్పుడో చెప్పిన గుర్తు.

" బాబూ ఇంక కబుర్లాపి స్నానం చెయ్యి" అంటూ బయటికొచ్చాను.

"అమ్మా నాగరాజు, కోడలు వచ్చారు, కిందే కూకున్నారు. మీరు పరిచ్చ చేసి మందులయ్యా రాసిత్తారని…." నాతో చెప్పింది.

"కోడలికి ఏంటీ బాధా?"

"నీళ్ళోసుకుంది. తిన్నది నిలవడం లేదు. ఓపాలి పరిచ్చ జేసి సెప్తావనీ"

"మొన్నేగా పెళ్ళయిందీ ?"

"ఆరుమాసాలవుతుందమ్మా. పెళ్ళికి రాకపోతివి. వైబోగంగా జరిగింది. అయినా ఏం
లాబం. కన్నతండ్రి రాలేదు. పిలిత్తే వొచ్చేవోడేమో, ఈడు పట్టుబట్టి కూసున్నాడు అయ్య పందిట్లోకడుగుబెడితే పీటలమీనే కూసోనని పేచీబెట్టాడు. ఎంతైనా కన్నతండ్రి, కొడుకుని పెళ్ళి బట్టల్లో సూసుకునే అదుష్టం లేకపోయే. ఎంతుండీ ఏం ప్రవేజనం ?పెనిమిటి రాలేదని సుట్టాలంతా అడిగారు." అంటూ కళ్ళు
తుడుచుకుంది.

లోపలికెళ్ళి రెడీ అయివచ్చాను.

అచ్చమ్మతో మాట్లాడుతున్న మా అబ్బాయి నన్ను గమనించి "అమ్మా సండే చీరేసుకున్నావే. అమ్మా ఇవ్వాల పేసంతులకెల్దొద్దమ్మా, ప్లీసమ్మా" అంటూ కాళ్ళకు చుట్టుకున్నాడు.

"ఇప్పుడే వచ్చేస్తా"

"అన్నీ అపద్దాలే. రావు" అంటూ ఏడుపు మొదలెట్టాడు.

"మరి బాబూ నీకు మా గుడిసెమీన పాము సంగజ్జెప్పానా? అడిగింది అచ్చమ్మ,
వాణ్ణి మాయపుచ్చడానికి.

"ఏంటీ?"

" ఓ సారి ఏమైందనుకున్నావూ ? అప్పటికి మా నాగరాజు కూడా నీఅంత కాదు. నీకన్నా పెద్దోడే. గుమ్మంలో లాంతర్ ముంగట కూసుని సదూకుంటన్నాడు.. గుడిసె మీన ఏదో కదుల్తన్నట్టు గసాగిసా ఇనొచ్చింది. ఎవురో మనింటిమీదకెక్కారన్నాడు. నేను లాంతర్ బయటికి దెచ్చి సూత్తంటే గభాల్న పేద్ద కట్టలపాము దబిక్కిన సుట్టలా గుమ్మం కాడ పడింది. ఎంత బరువుగా ఉందో ఆ సప్పిడికి పక్కింటోళ్ళు గోడమీంచి సూశారు దొంగోడు దూకాడేమోనని."

"సంపేశారా?"

"లేదు , ఎల్లమ్మా, ఎల్లు అంటే ఎల్లిపోయింది."

ఆ సందట్లో మెల్లగా జారుకున్నాను.

కిందకొచ్చి చూస్తే నాగరాజుమా రిసెప్షన్ దగ్గర నిల్చుని మా కాంపౌండర్ తో మాట్లాడుతున్నాడు.

నాగరాజు వాళ్ళావిడ ఆకుపచ్చని సిల్క్ చీర కట్టుకుని, చిక్కగా అల్లిన రెండుమూరల కనకాంబరాలు జడలో పెట్టుకుంది. చెవులకు రాళ్ళ బుట్టలు, మెడలో నెక్లెసు, బంగారు గాజులు, పాల జిడ్డు అంటని లక్ష్మీదేవిలా ఉంది. చిన్న వయసే.

వచ్చినప్పట్నుండీ ఒకటే ముసిముసిగా నవ్వుకుంటున్న నాగరాజు వాలకం చూసి కూడా ఏమీ తెలియనట్లు

"ఏంటీ బాధ అమ్మాయికి" అని ఆరా తీశాను ఏం చెప్తాడో చూద్దామని.

"చెప్పు , డాక్టరమ్మ అడుగుతుంటే... " అని పెళ్ళాంతో అన్నాడు.

" ప్రెగ్నన్సీ అంట మేడం." అంటూ మా నర్సు వచ్చి చెప్పింది.

మూడో నెల అట.

వేవిళ్ళు.

ఏం తినడం లేదని తీసుకొచ్చాడు.

ఆ అమ్మాయిని పరీక్ష చేసేసరికి అచ్చమ్మ పైనుండి కిందికి దిగివచ్చింది.

"ఎయ్యా వొద్దంటది. లోపల పిలగాడు ఎట్టా పెరుగుతాడు.ఒక్క రోజైనా సరే పెందలాడ లేస్తదా, ఊహూ ....లేసి రెండిడ్లీ తిని ఓ గళాసు పాలు తాగాలా వొద్దా?"

పాల మాట వినగానే ఆ పిల్ల "వాక్.. ఛీ" అంది.

"అదుగో అదుగో చూడు డాట్టరమ్మా ఇదీ వరస. పోనీ మీగడ పెరుగేసుకుని నాలుగు ముద్దలు తినవంటా. ఇనదు. ఆడితో అదేదో బండిమీద వొండేయి తెప్పించుకుంటది. "

ఆ పిల్ల నవ్వుతూ నూడిల్స్ అని చెప్పింది.

అయి తిని పొడుకుంటది.

మొన్న ఆడు సల్ల ఐస్ క్రీము తేలేదని దెబ్బలాడి పొడుకుంది.

★★★★★★★★

ప్రతినెలా అచ్చుమ్మొస్తుందంటే కంగారొచ్చేది. ప్రవాహం లాగా ప్రశ్నలూ , అనుమానాలూ, ఆ పితూరీలూ. ఎన్ని చెప్తున్నా ఆ కోడలికి కోపమొస్తున్నట్లే అనిపించేదికాదు. నవ్వుతూనే వినేది.

"లోపలున్నది పిలగాడేనా?"

" ఎవురైనా బాద లేదు. తొలిసూరు ఎవురైతే ఏంది?"

" మొన్న దానిమ్మ కాయలు తెచ్చాడా , కుళ్ళబెట్టి పారేసింది."

"ఫిజ్జులో సల్ల నీళ్ళు తాగుతా కూసుంటది. లోపల పిండానికి దెబ్బంటే ఇనదు."

తొమ్మిదోనెలలో చూపించేందుకు తీసుకొస్తూ ఓ పెద్ద పేకెట్ ఏదో తెచ్చింది. సీమంతం చేసిందట. చలివిడీ, స్వీట్లూ పట్టుకొచ్చింది.

"బిడ్డ పొదీషనూ అదీ బాగుందా?"

"లోపల నీరూ అదీ సుబ్బరంగా ఉన్నయ్యా?"

"కాన్పుకింకా ఎంత టైముందీ?"

"సులువు కాన్పు కావాలంటే ఏం చెయ్యాలీ?"

అని ఏవేవో అడుగుతోంది.

సీమంతం చేసిందంటే ఇంక పుట్టింటికి పంపిస్తుంది . అమ్మయ్య, డెలివరీ కి మనదగ్గరకు రాదు. లేకపోతే డెలివరీ రోజున ఈ అచ్చమ్మ చేసే గోలకు పిచ్చెక్కి పోవడం ఖాయం అనుకుని హాయిగా చలిమిడి పరిమళాను పీలుస్తూ, అందులో ఎండుకొబ్బరి వేశారో లేదోనని నిశ్చింతగా బెంగపడుతూ కూర్చున్నాను.

"ఇంతకూ వీళ్ళమ్మా వాళ్ళుండేది ఎక్కడా?" అడిగాను.

" సత్తెనపిల్లి దగ్గర పల్లెటూరు."

"అయితే మరీ మంచిది. సత్తెన పల్లిలో నా స్నేహితురాలుందిలే. చాలా బాగా చూస్తుంది. అక్కడికే తీసుకెళ్ళు "

"భలేదానివే డాట్టరమ్మా, సుబ్బరంగా టౌన్లో నేనుండగా ఉట్టి సుద్ద పల్లెటూరికెందుకూ అంపటం. నా మనవడు నాసేతిమీదే పుట్టాల. అసలే ఈళ్ళమ్మ మా పిన్నాం కోడలే. దానికేం తెలవదు. రాత్రేల ఏ అవుసరమొచ్చినా బండీ అదీ ఉండదు."

"మరి పిల్లకు వాళ్ళ అమ్మదగ్గర ఉండాలనిపిస్తుందేమో అచ్చమ్మా?"

" అందుకేగా, ఇక్కడికే ఒచ్చి ఉండమన్నా."

ఆ అమ్మాయి వంక చూశాను.

"అదేంకాదు మేడం . నేనులేకపోతే మా అత్తకు తోచదు. అందుకే ఇయ్యన్నీ చెప్తంది."

★★★★★★★

ఓ అర్థ రాత్రి కాన్పు నొప్పులతో తీసుకొచ్చారు. తెల్లవారుజామునకు అబ్బాయి పుట్టాడు. డెలివరీ అయిన తర్వాత మూడు రోజులున్నారు. ఆ మూడురోజుల్లో అచ్చమ్మను చూస్తే ఆశ్చర్యమేసింది.

ఉదయం పిల్లల్ని స్కూలు దించడానికి వెళ్ళే టైములో చూస్తే అచ్చమ్మ కోడలిని కూర్చోబెట్టి తలదువ్వి గట్టిగా జడేస్తోంది.

“అబ్బ ఫో , గట్టిగా దువ్వుతున్నావు. నెప్పి వస్తంది.”

“ఏంటే నీ యవ్వారం, కుదురుంగా కూసో, ఎంత చిక్కు పడిందో సూడు. ఉండు మరింత

నూనెరాస్తా, చిక్కు పోతది.”

“వద్దు, మొహం మీదకు కారిపోతది, నాకొద్దు ఫో.”

“మాటినకొచ్చింది పిల్ల.”

అత్తాకోడళ్ళు ఇద్దరూ సాయంకాలం పూట బయట కూర్చుని హాస్పిటల్ ఎదురుగా అంటించిన సినిమా పోస్టర్లు చూసి కబుర్లు చెప్పుకుంటూ ఉండేవాళ్ళు. కోడలికీ, మనవడికీ చేసే కొన్ని పనుల్లో ఏమాత్రం ఏపనికీ చీదరలేదు. విసుగు చూపించేది కాదు . పసివాడూ, కోడలూ ఎప్పుడూ చక్కగా పువ్వుల్లాంటి బట్టల్లో కళకళ లాడేవాళ్ళు. చక్కగా జడదువ్వడం, బట్టలు వెంటవెంటనే మార్చెయ్యడం, చివరికి అన్నం కూడా ముద్దలు కలిపి పెడుతుండేది. పేషంట్ తల్లి ఇంటిదగ్గర ఎవరూ లేరని, పాడిగేదెల్ని చూసేవాళ్ళు లేరని వెళ్ళిపోయింది. నాలుగో రోజున డిశ్చార్జ్ అయివెళ్ళిపోయారు

★★★★★

కొన్ని నెలలు గడిచాయి. ఓ రోజు ముసురుగా ఉంది. దానికి తోడు మంగళ వారం. పేషంట్స్ ఎక్కువగా రాలేదు. మధ్యాహ్నం రెండుగంటలకు బయటికొచ్చి చూస్తే , స్టాఫంతా సెల్లార్ లో భోజనానికి వెళ్ళినట్లున్నారు. ఎవరూ లేరు. రిసెప్షన్ లో ఓ మూల అచ్చమ్మ కూర్చుని ఉంది. అప్పుడప్పుడు గడ్డికోసమని వెళ్ళి తిరిగి వస్తూ మా హాస్పిటల్ లో కూర్చోవడం మామూలే. అచ్చమ్మను రిసెప్షన్ లో కూర్చోబెట్టి స్టాఫ్ భోజనానికి

వెళ్తుంటారు.

నేనొచ్చిన సంగతి కూడా గమనించుకోకుండా వానపడుతుంటే బయటికి చూస్తోంది. తలరేగి ఉంది. చూపెక్కడో ఉంది.

“అచ్చమ్మా, ఏంటిక్కడ కూర్చున్నావు?”

ముసురుకమ్మి ఉన్న కళ్ళు.

“ఏం లేదమ్మా.”

“భోజనం చేశావా?”

“ఆకలిగా లేదమ్మా.”

“మీ మనవడూ, కోడలూ బాగానే ఉన్నారా?”

బాగానే ఉన్నారన్నట్లు తలూపింది. మౌనంగా సమాధానాలు చెప్తున్న అచ్చమ్మ కొత్తమనిషిలా కనిపించింది.

“నాగరాజేమైనా అన్నాడా?”

లేదన్నట్టు తలూపింది.

లోపలికిరా అని రూం లోపలికి తీసుకెళ్ళాను.

“మంచినీళ్ళు తాగుతావా ?”

వద్దంది.

“వంట్లో బాగోలేదా? ఏవైంది అలా ఉన్నావే?”

ఆ మాత్రానికే కళ్ళు నిండు కడవలై, నీళ్ళు చింది, ఇటుకరాయి రంగు చీరమీద పడ్డాయి.

“ఈ వయసులో ఎందుకు నాకీ కరమ, పాడుజలమ సచ్చినా బాగుండు.” అంటూ వెక్కి వెక్కి ఏడ్చింది. .

కోడలితో ఏదో తగువయ్యిందేమో. అత్తాకోడళ్ళ మధ్య, మాటా మాటా వస్తూనే ఉంటాయి.

ఆ మాటెత్తితే అనవసరంగా గొడవ పెంచినట్లవుతుందని,

" అచ్చమ్మా, ప్రతి ఇంట్లో ఏదో ఒక గొడవ ఉంటుంది. అవే సర్దుకుంటాయి. అలా మనసు కష్టపెట్టుకుంటే ఎట్లా చెప్పు. నాగరాజుతో నేను మాట్లాడనా?"

“ వద్దు డాట్టరమ్మా, ఆడితో ఏం సెప్పొద్దు. నాకొడుకుముందు తలెత్తుకోలేను. దానికన్నా సావుమేలు”

నాలుగైదు వారాల తర్వాత ఓ రోజు సాయంత్రం నాగరాజొచ్చాడు.

“రాత్రిపూట అమ్మ నిద్రపోటం లేదమ్మగారూ. ఎప్పుడు సూసినా మంచం మీద కూర్చుని ఆలోసిస్తా ఉంటది. రెణ్ణెల్లబట్టీ సూస్తన్నా. ఏవన్నా అడిగితే, కళ్ళనీళ్ళు పెట్టుకుంటది. అదేమంటే, నేనున్నా లేపోయినా జాగ్రత్త అంటూ అప్పగింతలు చెప్తోంది.” అన్నాడు.

నిద్రపట్టకపోవడం, డిప్రెషన్, అకారణంగా ఏడవడం అన్నీ మెనోపాజ్ లక్షణాలైఉంటాయి.

“సరే ఓ సారి నేను చూసి మందులవీ ఇస్తాలే. కంగారు పడొద్దు.”

“ పిలగాడికి పుట్టెంటికలు తీయిద్దామని గురువారం కొండకెళ్తన్నాం. . అమ్మక్కూడా టికెట్టు తీసుకున్నా గానీ, అమ్మ రానంటే రానంటంది. అమ్మను బాబాయి కొడుక్కి అప్పజెప్పి ఎల్తన్నాను. మూడురోజులతర్వాత వస్తాము. ఏదైనా అవసరమొస్తే సూసుకుంటారనీ!”

“దానిదేముంది. నాగరాజూ, నీకు భయమైతే.. ఇక్కడే అట్టిపెట్టి వెళ్ళు.”

“పర్లేదండీ. అన్నయ్య బాగానే చూసుకుంటాడు.”

★★★★★★

గురువారం సాయంత్రం కళ్ళు తిరిగి పడిపోయిందని అచ్చమ్మను తీసుకొచ్చారు వాళ్ళ బంధువులు . బీపీ బాగా ఎక్కువగా ఉంది. తలనొప్పి , వాంతులు కూడా అవుతున్నాయని చెప్పారు. మనిషి కుదురులేకుండా ఏవేవో మాట్లాడుతోంది.

ఇదివరకు చదివిన కథేదో గుర్తొచ్చింది. కొడుకూ కోడలితో తిరుపతి వెళ్దామనుకున్న ఓ అత్తగారు, వాళ్ళిద్దరే వెళ్ళేసరికి తట్టుకోలేక పిచ్చిదవుతుంది. అలా ఏమైనా అయిందా?

బీపీ పెరిగితే తలనొప్పి రావడం, వాంతులు కావడం మామూలే. బీపీ తగ్గడానికి
ఇంజెక్షన్లు చేస్తే కాస్త సర్దుకుంది. పన్నెండింటివరకూ వేరే పనులేవో చూసుకుని , పైకి వెళ్ళబోయేముందు అచ్చమ్మనోసారి చూసి, రేప్పొద్దున్న ఫిజిషియన్ కు ఓ సారి చూపించాలి అనుకుని పైకెళ్ళి నిద్రపోడానికి ప్రయత్నిస్తుంటే రాత్రి రెండింటివరకూ నిద్రపట్టలేదు. ఓ మాదిరిగా నిద్రపడుతోంటే, డోర్ బెల్ మోగింది.

అచ్చమ్మ తలుపు తీసుకుని వెళ్ళిపోతోందనీ, అదేమంటే రైలుకిందపడతానంటోందనీ చెప్పింది నర్సు. పైకి తీసుకురమ్మన్నాను. అచ్చమ్మ కేసులో ఏదో మిస్ అవుతున్నానని తెలుస్తోంది. అదేంటో తెలియడం లేదు.

వీల్ చెయిర్ లో తీసుకొచ్చారు. మనిషి చూస్తే బాగానే ఉంది. బాల్కనీ కూడా ఒక రూం లాగా ఉంటుంది ఆ ఇంట్లో అక్కడో చిన్న మంచం లాంటిది వేశాను. పిల్లలు రోడ్డు మీద వెళ్ళేవాళ్ళను చూస్తూ అక్కడ కూర్చుని ఆడుకుంటారు. ఇనపగ్రిల్స్ కూడా ఉన్నాయి కాబట్టి భయంలేదని, అక్కడ పడుకోమన్నాను.

పడుకోకుండా నిటారుగా కూర్చుంది. నేను పక్కనే ఉన్న కేన్ కుర్చీలో ముడుచుకుని
కూర్చున్నాను.

“ఏమైంది అచ్చమ్మా, ఇంతకూ బయటికెక్కడికి పోతున్నావూ?”

ఏవిటేవిటో మాట్లాడుతోంది. రాత్రి మూడింటికి, పొంతన లేని కబుర్లేవో చెబుతోంది.

“ఏం కష్టమొచ్చిందీ?”

“అదేగా సెప్తున్నానూ? పెద్దమడిసైన మూణ్ణెల్లకు సమ్మంధం సూసి ముడేట్టేశారు.ఆర్నెల్లకే ఈడు కడుపున పడ్డాడు. ఈ పుట్టిన ఆర్నెల్లకు వేరే దాంతో కాపురం పెట్టాడు. ఆపైన ఎన్ని తంటాలు పడ్డానో దేవుడికి తెలుసు. రెండు బర్రెలు పెట్టుకుని పాలమ్ముకునేదాన్ని. పిల్లగాడు సేతికొచ్చాక ఇద్దరం కట్టపడి ఇల్లు అదీ ఏర్పాటుసేసుకున్నాం. దేవుడు మంచే జేశాడు. బంగారం లాంటి కొడుకునిచ్చాదు. అంతకన్నా నాకేం గావాల?

ఆయాల బాబు, కోడలు ఇంటికాడ లేరు. పిలగాణ్ణి తీసుకుని ఆళ్ళత్తగారింటి బోయారు. మా ఈపరాలికిస్టవని సితుకు సేపల్దెప్పిచ్చి సిక్కగా పులుసొండా. బాగా కుదిరింది. అరుగుమీన కూకున్నా. అప్పుడే అటుగా వొచ్చాడు ఆళ్ళ నాన.”

టైం గాని టైం లో ఈ చితుకు చేపల కథేంటీ? ఈ అచ్చమ్మకు మతిగాని పోయిందా ? పొద్దున్నే సైకియాట్రిక్ కన్సల్టేషన్
కూడా ఇప్పించాలి

“ఎవరి నాన్న అచ్చమ్మా?”

“అదే నా పెనిమిటి.”

అతను రెండో ఆవిడతో ఉంటాడుకదా, అనుకున్నానుకానీ ఏమ్మాట్లడకుండా వింటున్నాను.

“రోడ్డుమీన ఎవురూ లేరు. దగ్గరకొచ్చి ‘ఏటే బాగున్నావా?’ అన్నాడు.

వొల్లంతా జలజల్లాడింది.

ఆ పాట్న అరుగు దూకాను.

పిల్లగాడెటూ లేడు. తండ్రంటే అంతెత్తున లేస్తాడు. నా సేత్తో ఓ ముద్ద పెడదావని, పేణం లాగేసింది.

‘సితుకు సేపల పులుసుంది. వణ్ణం తిందూగానీ రా.’ అన్నాను.

తానం జెయ్యలేదన్నాడు. ఉడుకునీళ్ళుండాయంటే లోపలకొచ్చాడు.

"యేడేడిగా అన్నమొండి, సేపలపులుసుతో ఎడితే దాక మొత్తం కాళీ సేశాడు."

కాసేపు ఏమీ మాట్లాడలేదు కానీ, ఏం జరిగి ఉంటుందో ఊహించాను.

పాపం.... అచ్చమ్మ.

"అయితే ఎందుకిప్పుడు బాధ నీకు."

"అదికాదు డాట్టరమ్మా, ఆడొచ్చాడని తెలిస్తే నాగరాజు ఆళ్ళనాన్ననూ, నన్నూ ఇద్దర్నీ బతకనియ్యడు."

"ఎవరు జెప్తారు నీ భయంగానీ."

"కాదమ్మా, ఆ యాల్టినుండీ బయట జేరలేదు. నాలుగునెలలయ్యింది."

"అదా నీ భయం. నీవయసులో అలాంటివేం జరగవులే!"

"కాదమ్మా కడుపుకూడా పెరుగుతున్నట్టూ, ఎవురో కదుల్తా వున్నట్టు ఏందో అనుమానం"

"బహిష్టులు ఎండిపోయే వయసొచ్చింది. అదీగాక మరీ ఎక్కువ ఆలోచన చేసినా, కంగారెక్కువైనా కూడా రావు. అంతేఈ వయసుకు పొట్టలో కొవ్వు చేరుతుంది. జీర్ణాశయం, ప్రేగులూ కదులుతుంటాయి. అంతకు మించి ఇంకేం కాదు."

"అంతేనంటావా. ఎంత సల్లటి కబురుసెప్పావు . అబ్బ ఎంత బయమేసింది డాట్టరమ్మా, ఈ నాలుగునెలలూ నిదరలేదు, తిండి తినబుద్ధికాలేదు. నా బిడ్డొచ్చేసరికి రైలుకింద పడదామనే కొండక్కూడా రానన్నాను. ఇంక పోదుకో" అని మంచమ్మీద పడుకుని నిద్రపోయింది.

ఏంటీ ఆడవాళ్ళ బతుకులు. తండ్రి , అన్న, భర్త, కొడుకు ....ఎంత వయసొచ్చినా సరే , ఎవరికో ఒకరికి భయపడాలా?

నేను కూడా కేన్ కుర్చీలో పడుకుని ఇంకో కుర్చీలో కాళ్ళు పెట్టుకుని నిద్రపోయాను.

నిద్రపోతుంటే దబ్ మన్న శబ్దమైంది. పక్కనే ఉన్న బల్ల మీద పడుకున్న అచ్చమ్మ కిందపడి నేల మీద పడ్డ శబ్దం!

★★★★★★

లేచి లైట్ వేసి చూస్తే అచ్చమ్మ నేలమీద గిలగిలా కొట్టుకుంటోంది. ఫిట్స్ వస్తున్నాయి. కింద స్టాఫ్ ని పిలవడానికి పైన ఒక బెల్ ఏర్పాటు చేశాము. పరుగుపరుగున ఆ బెల్ నొక్కాను. త్వరత్వరగా అచ్చమ్మను తీసుకెళ్ళి, టేబిల్ మీద పడుకోబెట్టి, ఆక్సిజెన్ పెట్టి చూస్తే బీపీ మళ్ళీ పెరిగినట్లు మోనిటర్ చూపిస్తోంది. బీపీ తగ్గడానికి ఇంజెక్షన్ చేసి, అది మెయింటైన్ చెయ్యడానికి , ఫిట్స్ తగ్గడానికి సెలైన్ పెట్టాను.

కాస్త కుదురుకున్నట్లే ఉంది. చీరమొత్తం వాంతి చేసుకుంది. హాస్పిటల్ గౌన్ కు మార్చమన్నాను. స్టాఫ్ బట్టలు మారుస్తుంటే చూశాను. ఎత్తుగా ఉన్న పొత్తికడుపు.

ఒక్క సారిగా కుదుపు తిన్నాను.

స్కానింగ్ చేసి చూస్తే , నాలుగైదు నెలల పిండం కనిపించింది. కదలికలు లేవు. గుండె ఆగిపోయి చాలా సేపైనట్లుంది. లేటు వయసులో గర్భం రావడం వల్ల బీపీ పెరిగి, ఫిట్స్ వచ్చాయి.

ఒక సారి ఫిట్స్ వచ్చిన తర్వాత ఆ గర్భాన్ని తొలగించాల్సిందే. తప్పదు. అచ్చమ్మ పరిస్థితి కాస్త సర్దుకున్న తర్వాత, బిడ్డ బయట పడేందుకు ఏర్పాట్లు చేశాను. నాలుగైదు గంటల తర్వాత అవాంఛిత గర్భం వల్ల కలిగే శోకం తప్పిపోయింది.

★★★★★★

రెండు రోజుల తర్వాత నాగరాజు వచ్చాడు.

అప్పటికి అచ్చమ్మ కోలుకుంది. బాగానే తిరుగుతోంది. బీపీకూడా కంట్రోల్ లో ఉంది.

అచ్చమ్మకు బీపీ పెరిగిందనీ, ఇప్పుడు కంట్రోల్ అయిందనీ, ఇంక మరేం పర్లేదనీ చెప్పాను.

వెళ్ళబోయేముందు, నాదగ్గర కూర్చుంది.

"ఏవైంది నాకు?" అని అడిగింది.

అచ్చమ్మ వంక ఓ సారి చూశాను. పదమూడేళ్ళకు పెళ్ళి చేసి ఉంటారు. పద్నాలుగేళ్ళకు నాగరాజు పుడితే, ఇప్పుడు అతనికి ఇరవైనాలుగేళ్ళు. అంటే మొత్తం కలిపి నలభైఏళ్ళు కూడా ఉండి ఉండవు. పొలం పనులు చేసి, వయసు మించినదానిలా కనిపిస్తోంది. ఆమెకు మెనోపాజ్ అంటగట్టి , తన అనుమానాన్ని కొట్టిపారేసినందుకు లోపల్లోపలే సారీ చెప్పుకుని, ఏం జరిగిందో చెప్పాను.

" అయిదోనెల . ఆడపిల్ల పుట్టింది. జరిగింది మనిద్దరిమధ్యే ఉండనీ. ఆయమ్మ, నర్సు కూడా ఎవరితో చెప్పరు. నువ్వు కూడా మర్చిపో అచ్చమ్మా."

"పిల్లగాడి ముందు పరువు కాపాడావు. లేపోతే సావుతప్ప వేరే దిక్కు లేకపోయేది."

లేచి వెళ్ళబోతూ , తలుపు దగ్గర నిల్చుని,

"తల్లంటే కడుపున పుట్టిన బిడ్డలు బాగుండాలనుకుంటది, పిల్ల సచ్చిపోయినందుకు సంతోసపడతన్నాను. నేనేం మడిసిని?" అంది.

ఆ బిడ్డ ప్రాణం లేకుండా పుట్టినందుకు, నేను కూడా రిలీఫ్ పొందిన మాట నిజమే . ఆ లెక్కకొస్తే నేనేం మనిషిని? అచ్చమ్మ అడిగిన ప్రశ్నకు నాదగ్గర జవాబు లేదు.

"అచ్చమ్మా, ఇంక ఈ విషయం గురించి మాట్లాడితే నామీద ఒట్టే!"

★★★

*(వచ్చేనెల మరో కథ)*

Post your comments